క్లుప్తంగా

అదనపు టీఎంసీ పనులపై ఆర్డీవో రివ్యూ


ఆర్డీవో పవన్‌కుమార్

బోయినపల్లి: మండలంలో జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ వరద కాల్వ పనుల పురోగతిపై వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ మంగళవారం స్థానిక తహసీల్దార్ దర్శెల్లి నరేశ్‌తో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు చేసిన భూసేకరణ, అందిన పరిహారం తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ.ప్రభాకర్ ఉన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

బోయినపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించిన అనంతరం మధ్యాహ్న భోజనం తీరును తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కూరగాయలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని చరిత్రలో మహనీయుల జీవిత పాఠాలను తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహావిష్కరణ


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన విప్లవకారుడిగా ఎందరినో చైతన్యపరిచిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అన్నారు. అంతకుముందు పూలే చిత్రపటంతో భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ సవిత, మాజీ జెడ్పీటీసీ అంతయ్య, ముదిరాజ్ సంఘం బాధ్యులు పిట్ల రాంగోపాల్, నర్సయ్య, రాజయ్య, మల్లయ్య, అంజనేయులు, నరేశ్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త

వేములవాడఅర్బన్: సైబర్ మోసాలతో జాగరుకతతో ఉండాలని వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ అన్నారు. మంగళవారం వేములవాడ మండలం అనుపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు ఎక్కువ అవుతున్నాయని, సెల్‌ఫోన్ జాగ్రత్తగా వాడాలన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ వాడకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, ఎస్సై వెంకట్రాజం, ఎంపీటీసీ బస రాజశేఖర్, హెచ్‌ఎం కవిత పాల్గొన్నారు.

తైబందీకి మించి సాగు

- 13 వేల ఎకరాల తైబందీకి, 22 వేల ఎకరాల సాగు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- మానేరు ప్రాజెక్టు కింద పెరిగిన ఆయకట్టు

ముస్తాబాద్: సిరిసిల్ల మెట్ట ప్రాంతానికి వరప్రదాయని అయిన ఎగువ మానేరు మధ్యతరహా నీటి ప్రాజెక్టు కింద నిర్ణయించిన ఆయకట్టు స్థిరీకరణ (తైబందీ) 17 వేల ఎకరాలు కాగా, ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కింద 22 ఎకరాల్లో రైతులు సాగుచేస్తుండడంతో కాలువ చివరి భూములకు నీటి సమస్య తలెత్తింది. నర్మాల సమీపంలో కూడవెల్లి, పాల్వంచ వాగుల కలయిక వద్ద ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1947లో నిర్మించిన ఈ ప్రాజెక్టు రాజన్న సిరిసిల్ల జిల్లా రైతాంగానికి ఆయువు పట్టు. 2.2 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాలకు నీటి సరఫరా చేస్తుంది.

బీడు భూములు సాగులోకి..

ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో బీడు భూములు పెద్ద ఎత్తున సాగులోకి వచ్చాయి. ప్రాజెక్టు కుడి కాలువ కింద అంటే డిస్ట్రిబ్యూటరీ–1 నుంచి డిస్ట్రిబ్యూటరీ–24 వరకు ఆనాటి కాలంలో కేవలం పది వేల ఎకరాల వరకు మాత్రమే తైబందీ ఉండేది. అయితే కెనాల్‌ను అనుకుని ఉన్న బీడు భూములను రైతులు చదును చేసుకున్నారు. గుట్టలు, చెట్లను తొలగించి సాగుకు అనుకూలంగా మలుచుకున్నారు. ఈ భూములకు అదనంగా ప్రాజెక్టు నీటిని రైతులు తరలిస్తున్నారు. ముఖ్యంగా లింగన్నపేట, కొత్తపల్లి, మల్లారెడ్డిపేట, నామాపూర్, రాంరెడ్డిపల్లె, గూడెం, ముస్తాబాద్, పోతుగల్‌లో సాగు భూములు పెరిగాయి. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరందే పరిస్థితి లేదు.


ముస్తాబాద్‌లో నీటి సరఫరా లేని మానేరు కెనాల్ అక్రమంగా నీటి తరలింపు

లోతుచెరువు రిజర్వాయర్‌తోపాటు పెనం మడుగు వద్ద రైతులు నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. అలాగే కెనాల్స్‌కు బుంగలు కొడుతున్నారు. లష్కర్లు ఉన్నప్పటికీ పర్యవేక్షణ సరిగా చేయడం లేదనే అపవాదు నీటిపారుదల శాఖ మూటగట్టుకుంటోంది. ప్రాజెక్టు కింద 22 వేల ఎకరాలు సాగులో ఉన్నట్లు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. కాలువ ఎగువన రైతులు సంతోషంగా పంటలు సాగు చేస్తుండగా, చివరి ఆయకట్టు రైతులు మాత్రం తమ పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లష్కర్లకు సమస్యలు

ఎగువ మానేరు ప్రాజక్టు తైబందీ ఆయకట్టుకు తప్పనిసరిగా నీరు అందించే బాధ్యతలను నీటిపారుదల శాఖ తీసుకుంది. ఈమేరకు కలెక్టర్ 45 మంది లష్కర్లను కాంట్రాక్టు పద్ధతిలో కేటాయించారు. వీఆర్ఏలను డిప్యూటేషన్‌పై నాలుగు నెలల కాలానికి లష్కర్లుగా పనిచేసేందుకు ఏర్పాటు చేశారు. అయితే ఆయకట్టు మేరకు నీటి సరఫరా చేసే విధంగా వారు పని చేసినప్పటికీ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఉప కాలువల నుంచి నీటిని అదనంగా తరలించే విధానానికి లష్కర్లు అడ్డుకట్ట వేస్తుండగా, రైతులు వారిని నిలువరిస్తున్నారు. మల్లారెడ్డిపేట, సింగారం, కోరుట్లపేట, నామాపూర్, పోతుగల్ గ్రామాల రైతుల మధ్య ఈ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. తెర్లుమద్ది రైతులైతే పూర్తిగా మానేరు నీటిపై ఆశలు వదులుకున్నారు. అలాగే గూడెం, కొండాపూర్, తెర్లుమద్ది, పోతుగల్, నామాపూర్, ముస్తాబాద్ రైతులు బోరుబావుల కిందే సాగుచేసుకుంటున్నారు. మానేరు ఆయకట్టు ఉన్నప్పటికీ సరిపడ నీరు రాకపోవడంతో బోర్ల కిందే సాగు చేస్తున్నారు.

నీటి సరఫరా తగ్గింది

నెల రోజులుగా నీటి సరఫరా లేని కెనాల్ నామాపూర్, గూడూరు, పోతుగల్, ముస్తాబాద్ గ్రామాల్లో మానేరు కెనాల్‌కు నెల రోజులుగా నీటి సరఫరా తగ్గింది. దీంతో కెనాల్‌ను నమ్ముకుని సాగు చేసుకుంటున్న పొలాలు ఎండిపోతున్నాయని పోతుగల్ రైతులు మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా ముస్తాబాద్ పెద్ద చెరువు నీటిని మళ్లించారు. అయితే మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా నీటిని అందిస్తామని, మానేరు ప్రాజెక్టు నీరు లోతు చెరువు రిజర్వాయర్ వద్ద 13 అడుగులు ఉండడం లేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

మంత్రికి ఫిర్యాదు చేశాం



పోతుగల్ పరిధిలో మానేరు కెనాల్ కింద ఐదు వందల ఎకరాలు సాగులో ఉంది. డీ–18 నుంచి మాకు చుక్క నీరు రావడం లేదు. దీనిపై మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేయడంతో పెద్ద చెరువు నీటిని అందిస్తున్నారు. పంటలు ఎండకుండా శాశ్వత పరిష్కారం చేయాలి.

– తన్నీరు గౌతంరావు, సర్పంచ్, పోతుగల్

ఎగువన ఎక్కువ సాగవుతోంది



మానేరు కెనాల్ ఎగువన తైబందీకి వ్యతిరేకంగా సాగు చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. తైబందీ ప్రకారమే సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలి. ప్రాజెక్టు చివరి వరకు నీరందించాలి.

– కొండం రాజిరెడ్డి, రైతు, నామాపూర్

బోర్లను నమ్ముకున్నాం



మానేరు కెనాల్‌ను నమ్ముకుని వరి సాగుచేస్తున్న రైతులు నష్టపోతున్నారు. నెల రోజులుగా నీరందడం లేదు. బోర్లు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. కెనాల్‌లోకి నెల రోజులుగా నీరు రావడం లేదు. దీనిపై అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, ముస్తాబాద్

అవగాహన కల్పిస్తున్నాం



తైబందీ ప్రకారమే సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తైబందీకి మించి సాగు చేసుకోవడం వల్ల చివరి గ్రామాలకు నీటి సరఫరా ఇబ్బంద వుతోంది. పలుచోట్ల రాత్రివేళల్లో కెనాల్ నీటిని తరలిస్తుండడంతో ఇబ్బంది వస్తోంది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని నీటిని అందిస్తున్నాం.

– వంశీకృష్ణ, ఏఈ, ఇరిగేషన్ శాఖ

జ్యోతిబా పూలేకు నివాళి

సిరిసిల్ల: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మహాత్మ జ్యోతిబా పూలే 197వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు అందరు కట్టుబడి ఉండి సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి బందారి బాల్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, కాంగ్రెస్ పార్టీకి చెందిన డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, సీపీఎం జిల్లా నాయకులు జవ్వాజి విమల, బీఎస్పీ జిల్లా కార్యదర్శి బొడ్డు మహేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భానుతో పాటు పలువురు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


వేములవాడఅర్బన్: రుద్రవరంలో నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు


తంగళ్లపల్లి: గండిలచ్చపేటలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


ఇల్లంతకుంట: నివాళి అర్పిస్తున్న నాయకులు

సమాచారం

ఫొటోగ్రఫీ పోటీలు

సిరిసిల్లకల్చరల్: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ నిర్వాహకుడు మేర్గు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. హెరిటేజ్ ఆఫ్ తెలంగాణ, ఉస్మానియా యునివర్సిటీ ఆర్కిటెక్చర్, హెరిటేజ్ ఆఫ్ హైదరాబాద్ అనే మూడు విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో విజేతలకు రూ.74 వేల నగదు, 50కి పైగా అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ నెల 18న హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగే పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల వారు 80080 21075 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కోనరావుపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 16 ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో, 7–10 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 16న 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10.12 గంటల మధ్య, 7–10 తరగతుల వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ http://telanganams.cgg.gov.in నుంచి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని, బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమాల మల్లేశం డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీడీ కార్మికులు పెంచిన కరువు భత్యాన్ని యజమానులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని వల్ల ఎంతోమంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కానీ కొందరు యజమానులు చెల్లించడం లేదన్నారు. అలాగే బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కెవి అనసూర్య, పంతం రవి, శాంత, ఈశ్వర, లక్ష్మి, భూలక్ష్మి పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను వాయిదాల ప్రకారం చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను వాయిదాల ప్రకారం చెల్లించాలని, రుణాలను సక్రమంగా చెల్లిస్తేనే వడ్డీ మాఫీ జరుగుతుందని ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామ మహిళ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, సీసీలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీర్నపల్లి: మండల కేంద్రంలో సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ సీపీఐ పార్టీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో ప్రారంభమై మే 14న కొత్తగూడెంలో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. 'బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావ్' అనే నినాదంతో తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం కొరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సోమ నాగరాజు, మల్లారపు దేవయ్య, మాట్ల అశోక్, గజ్జెల ప్రభాకర్, గౌరి రాజం, కోనేటి పర్శయ్య, మల్లారపు ఎల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' మట్టి ప్రైవేట్ పరం


వట్టెంలలో ప్రైవేటు స్థలంలో డంప్ చేసిన ఉపాధిహామీ మట్టి

- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

వేములవాడరూరల్: ఉపాధిహామీ కూలీల ద్వారా జరిగే పనుల్లో మట్టిని రైతులు మాత్రమే ఉపయోగించుకోవాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో ఉపాధి కూలీలతోనే ప్రైవేటు వ్యాపారులు ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీలు గుర్తించిన ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు నిర్వహించాలి. అక్కడ తవ్విన మట్టిని రైతులు పొలాల్లో వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చారు. కానీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం తవ్వుతున్న మట్టిని ప్రైవేటు ట్రాక్టర్ యజమానులు మట్టిని తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మంగళవారం మండలంలోని వట్టెంల శివారులో ఉపాధిహామీ కూలీలు మట్టి తీస్తూ ప్రైవేటు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఏపీవో మల్లయ్యను వివరణ కోరగా రైతుకు ట్రాక్టర్‌లో మట్టి పోసే వరకు మన కార్మికులు పని చేస్తారు. తదుపరి మట్టి ఎక్కడ పోసుకున్నా మాకు సంబంధం లేదు.

హోసన్నా నూతన మందిరం ప్రారంభోత్సవం



హోసన్నా నూతన మందిరం

వీర్నపల్లి: మండల కేంద్రంలో హోసన్నా మందిరాన్ని ఫాస్టర్స్ అబ్రహం, ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాస్టర్స్ మాట్లాడుతూ ప్రతి మనిషి విశ్వాసం, ప్రేమ, నమ్మకం, జాలి, కరుణ కలిగి ఉండాలని అవి లేని వారికి పరలోక రాజ్యం ఉండదని అన్నారు. అందరూ కూడా శుద్ధితో ఏసు కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, క్రైస్తవులు పాల్గొన్నారు.

రైతు సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

- ఎమ్మెల్యే రవిశంకర్‌కు రైతు సంఘం నాయకుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన రైతు సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో రైతు సంఘం భవనం కోసం ప్రభుత్వ స్థలంతో పాటు భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందచేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిట్టల మోహన్, రైతు సంఘం అధ్యక్షుడు బోయిని ఎల్లేశ్ తో పాటు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం పోసేందుకు స్థలం కేటాయించాలి

వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం పోసేందుకు స్థలం కేటాయించాలని బోయినపల్లి సర్పంచ్ గుంటి లతశ్రీ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఏఎంసీ పరిసరాల్లో ఉన్న సర్వే నంబర్ 572లోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని చదును చేయించి మొరం పోస్తే రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని అన్నారు.

వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్స్ పంపిణీ

మండలంలోని వరదవెల్లి గ్రామ మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే వడ్డీ లేని రుణాల ప్రొసీడింగ్స్ కాపీలను అందచేశారు.

అబద్ధాల పుట్ట మంత్రి కేటీఆర్


రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ గ్రామంలో మహిళ భవనం లేకున్నా ఉన్నదని, జరగని అభివృద్ధి జరిగినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షులు బొడావత్ రవీందర్‌నాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మంత్రి స్థాయిలో ఉండి ప్రజలకు ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చెప్పి నమ్మించడంలో కేటీఆర్ దిట్ట అని అన్నారు. గ్రామంలో లేని క్రీడా భవనం గురించి ఏర్పాటు చేసినట్లు చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. లేని భవనాల గురించి మాట్లాడిన మంత్రి వాటిని ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు.